# స్వప్నంలో స్వర్ణ

శ్రీ ఎస్. ఎమ్. వాద్రేవ్

ఆరుగంటలయింది!

ఆనందంతో ఆనందరావు కంపెనీ హాల్లోంచి బయటకువచ్చి, మెయిన్ రోడ్డెక్కాడు. ఎవ్వరూ చూడకుండా భార్య స్వర్ణకు నాలుగణాల గులాబీ పువ్వులు కొన్నాడు. స్నేహబృందంలో వారెవ్వరూకూడ కనబడకుండా ఉండాలని సాధ్యమయినంత త్వరలోనే యింటిని చేరుకున్నాడు. చెల్లెలు ఎదురయి, "అన్నయ్యా! పువ్వులు తెచ్చావా?" అంది. నేను స్వర్ణకు సంతోషంతో యిద్దామంటే చెల్లెలు అడుగుతుందా? అని గుర్రుమిమిచూశాడు. పాపం! అమాయకురాలు తల్లిదగ్గరకు వెళ్ళిపోయింది. తనకు స్వర్ణ ఎదురయి సంతోషంతో స్వాగతం చెబుతుందనుకున్నాడు. అలా జరగలేదు.

స్వర్ణజాడ లెక్కడా కనబడక తల్లి దగ్గరకువెళ్లి అడిగాడు. తల్లి రుసరుసలాడుతూ "ఏం! అలా అడుగుతావ్! చెల్లెలు అడిగిన దానికి సమాధానం చెప్పలేదూ - స్వర్ణ ఏదీ? అని అడగటానికి నీ నోరెట్లా వచ్చింది? బయటుంది, మూడు రోజులదాకా పనితప్పదు. కోడళ్లువచ్చినా యింతే! రాకపోయినా యింతే! ఆ మాత్రం అడిగిందనేనా లేకుండా అలా గుడ్లెఱ్ఱచేసావ్!" కొడుకూ కూతుళ్ల సంభాషణలువిని కొడుకుని దులిపేసింది.

ఆనందరావుకి దూర్వాసుడికి వచ్చినంత కోపం వచ్చింది. చేతిలోనున్న పొట్లం వంటింట్లోకి గిరవాటెట్టాడు. గదిలోకి వెళ్ళిపోయాడు. స్వర్ణతోకలసి సరదాగా ఎగ్జిబిషన్‌కు వెళదామని ఆఫీసువర్కు త్వరగా పూర్తిచేసివచ్చాడు. ఆ కుతూహలమంతా అణగారిపోయింది. తన హృదయం ఎంతగా బాధపడుతోందో ఎవరికి తెలుసు? ఎవరితో చెప్తాడు? భార్యతోనే చెప్పాలి - ఎలాగు! తల్లి సరే సరి.

"ఓరే! ఆనంద్రం. చెల్లాయికి ఎగ్జిబిషను చూపించరాదూ?" తల్లి అంది. "దానికి నీళ్లయ్యాక అందరం వెళ్లచ్చులే" ఆనందరావు ముక్తసరిగా జవాబిచ్చాడు.

స్వర్ణ ఆ రాత్రి తన దగ్గర లేకపోవడం చాల నగుబాటుగావుంది ఆనందరావుకి. అన్నం దగ్గర మొహమాటం లేకుండ భార్యకు సంజ్ఞలద్వారా తెలిపి తనకు కావలసినవి వేయించుకుని తినేవాడు. ఈ మూడు రోజులు తల్లి కూడు తినాలని బాధపడ్డాడు. కూర కావాలంటే కళ్ళతో చెప్పేవాడు. అది అర్థంచేసుకుని స్వర్ణ వడ్డించేది. తల్లిని యిది కావాలి; అది కావాలి అని అడిగి మరీ వేయించుకోవాలి. మజ్జిగ మొన్ననే వచ్చిన కొత్త గోదావరి నీళ్లు. స్వర్ణ బంగాళా దుంపల కూర వండేది - ఎంత రుచిగా వుంటుంది! మా అమ్మ వండిందీ - మాడ్చేసి వేయించిన అరటికాయ ముక్కలు. స్వర్ణ చేత్తో వడ్డించిన వంట చాల బాగుంటుంది. ఆ నాడు పండగే! ఎలాగయితేనేం ఆ పూట అయిందనిపించాడు. రాత్రి భోజనానికి రమ్మంటే కడుపునొప్పి అని వంక

పెట్టి ఆ మూడు రోజులూ అయ్యరు హోటలుకు రోజుకి రెండు రూపాయలు చెల్లించాడు. హోటల్లో ఇంతకన్న బాగుంటుందన్నమాట అతనికి. మూడురోజులు ఆనందానికి నరకప్రాప్తి లభించింది.

స్వర్ణకు నగలు లేవు, చేయించాలి, తెచ్చే నూటపది రూపాయలు తిండికే చాలుతుంటే నగలెలావస్తాయి ? పైగా తల్లి, చెల్లెలు మేస్తున్నారాయె తన ఆదాయంలో, ఏపార్టీ కైనా వెడితే ఒక మంచి బెంగుళూర్ సిల్కు చీరయినా లేదు. కొనాలి. కొద్దిగా సంగీతం వచ్చునంది. మా ఆఫీసు ఢిల్లీ మారితే పెద్ద యిల్లు రెంటుకి తీసుకొని చుట్టూ పెద్ద పార్కులాగా వేయించాలి. ఒక స్టుడీబేకర్ కొనాలి. స్వర్ణకు మంచి ఫేషన్స్ నేర్పాలి- కొద్దిగా చదువుకున్నానంది ఫరవాలేదు. ఆ మాత్రం వచ్చినవాళ్లు కూడా లేరు. యిలా ఇంకా అనుకుంటూ ఆనందంగా ఆనందరావు కళ్లకి విశ్రాంతి నిచ్చాడు.

క్రింద పెద్ద గదిలోంచి ఏవో పిచ్చి అరపులు వినబడ్డాయి. ఆ అరపులకు హడలిపోయి 'స్వర్ణ ... స్వర్ణా ... స్వ ... ర్ణ ...'' అంటూ మంచంమీద నుంచి క్రిందకు దొర్లిపడ్డాడు. భార్య స్వర్ణకు ఆపదేమయినా వచ్చిందేమోనని. ప్రక్కనే పడుకున్న తల్లి, చెల్లెలు లేచారు. క్రిందపడిన ఆనందరావుని కూర్చోబెట్టింది తల్లి.

''ఏరా! ఆనందం! ఏంకలవచ్చిందిరా. మంచంనుంచిపడ్డావు'' ఆదుర్దాతో తల్లి అడిగింది.

''స్వర్ణ ఎవరన్నయ్యా! ఓహో రాబోయేవదినమ్మగారా! ఇంకా ముహూర్తం చాలరోజులుంది - ఓపికపట్టు'' చెల్లెలు నవ్వుతూ అంది.

''యింతసేపటినుండి జరిగిన రభసంతా కలన్నమాట'' అని అనుకుని నవ్వుతూ దంతధావనానికి లేచాడు.

## శ్రీమతి కానుమిల్లి వెంకట నరసమ్మగారి భూరివిరాళము

పశ్చిమ గోదావరిజిల్లా కొయ్యలగూడెంలో శ్రీమతి కానుమిల్లి వెంకటనరసమ్మగారి పదివేల రూపాయల విరాళములో కిడింగుమిషన్ హాస్పిటలులో నిర్మించబడిన శ్రీ గెడా గెరటయ్య మెడికల్ వార్డు 7-4-59 న దివాన్ బహుదూరు బండి శ్రీహరిరావునాయుడుగారి అధ్యక్షతన ఆవిష్కరించబడెను. పలువురు పెద్దలు ఉత్సవములో పాల్గొనిరి. శ్రీమతి వెంకట నరసమ్మ తల్లిదండ్రులపేరిట- అక్కగారి పేరిట చేసినదానములు కీర్తించబడి ఆమె అభినందించబడిరి. అధ్యక్షులు శ్రీ శ్రీహరిరావునాయుడుగారు ఆమె విద్యాసౌకర్యములకొరకు, వైద్యసహాయవసతులకొరకు యింతవరకు లక్ష యాభైవేల రూపాయలను విరాళముల నిచ్చిరనియు, శ్రీ గెడాగెరటయ్య బోర్డు హైస్కూలుయొక్క హరిజన హాస్టలుకు సాలీనా ఖర్చులకుగాను 15 యకరముల భూవసతిని కన్నాపురములోను, అచ్చటనే ప్రభుత్వము స్థాపింపబోవు సర్వీస్ హోముకు 13 యకరముల భూవసతిని కల్పించిరని వివరించిరి.